క్లుప్తంగా

పరామర్శ

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని బొగ్గు లైన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎస్వీఆర్ కళాశాల చైర్మన్ వెంకటరామిరెడ్డిని..వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు మలికిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. వెంకటరామిరెడ్డి కారులో ఇంటికి వెళ్తుండగా బొగ్గులైన్ వద్ద లారీ బలంగా ఢీకొంది.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



క్రీడాకారిణిని అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని సాయి చైత్రను సోమవారం ఎస్‌డీఆర్ జూనియర్ కళాశాల కళాశాలలో అభినందించినట్లు చైర్మన్ కొండా రెడ్డి తెలిపారు. సీనియర్ నేషనల్ బేస్‌బాల్ పోటీల్లో జాతీయ స్థాయిలో ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈనెల 29 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు మహారాష్ట్రలోని అమరావతిలో జరిగే పోటీల్లో విద్యార్థిని పాల్గొంటుందని చెప్పారు. సీనియర్ నేషనల్ బేస్‌బాల్ పోటీల్లో రాష్ట్రం నుంచి మహిళా విభాగంలో జాతీయ స్థాయిలో ఎంపిక కావడం గర్వకారణమన్నారు.

యూరియా కొరత సృష్టించొద్దు



ఆలమూరులో పురుగు మందుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

రుద్రవరం: యూరియా కొరత సృష్టించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి సుమతి, ఎస్ఐ మహమ్మద్ రఫీ దుకాణాదారులను హెచ్చరించారు. మండల పరిధిలోని ఆలమూరు, మందలూరు గ్రామాల్లోని పురుగు మందులు, ఎరువుల దుకాణాల్లో సోమవారం వారు తనిఖీలు నిర్వహించారు. ఎరువులు, పురుగు మందుల స్టాక్ వివరాలను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు దుకాణాదారులకు పలు సూచనలు చేశారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలన్నారు. వారి వెంట ఏఈఓ రాజు, ఏఎస్ఐ బాలన్న, వీఆర్వో పుల్లయ్య ఉన్నారు.

28న జిల్లా స్థాయి చెస్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 28వ తేదీన జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రా చెస్ అసోసియేషన్ నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికృష్ణ, కార్యదర్శి రామసుబ్బారెడ్డి, టోర్నమెంట్ డైరెక్టర్ రాజేష్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ వివేకానంద ఆడిటోరియంలో నంద్యాల జిల్లా స్థాయి ర్యాపిడ్ అండ్ బ్లిడ్జ్ వేర్వేరు విభాగాల్లో చెస్ పోటీలు ఉంటాయన్నారు. ఈనెల 27న ఏపీ చెస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే సెప్టెంబర్ 13, 14 తేదీల్లో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో జిల్లా జట్టు పాల్గొంటుందని చెప్పారు. వివరాలకు సెల్ 9010451585 నంబరులో సంప్రదించాలని కోరారు.

శ్రీశైలం మండలాన్ని మార్కాపురం జిల్లాలో కలపాలి

శ్రీశైలం ప్రాజెక్టు: శ్రీశైలం మండలాన్ని నూతనంగా ఏర్పాటు చేయాబోతున్న మార్కాపురం జిల్లాలో కలపాలని అఖిలపక్ష సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం శ్రీశైలం ప్రాజెక్టులోని స్వామిరెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. శ్రీశైలం మండలం భౌగోళిక పరంగా కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాకు 180 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. ఏదైనా ప్రభుత్వ కార్యకలాపాల కోసం, ఆసుపత్రి, విద్య తదితర సదుపాయాల కోసం ఇక్కడ ప్రజలు వెళ్లి రావాలంటే వ్యయప్రయాసలకు గురవుతున్నారన్నారు. శ్రీశైలం నుంచి దోర్నాల ఆత్మకూరు వరకు సుమారు 110 కిలోమీటర్లు ఘాట్ రోడ్డు ఉండడంతో అత్యవసర సమయాల్లో ఆ రోడ్లపై ప్రయాణం చేయాలంటే ఇక్కడి ప్రజలకు ఇబ్బందిగా ఉందన్నారు. ప్రభుత్వం మార్కాపురం జిల్లా చేస్తే శ్రీశైలం మండలంలోని శ్రీశైలం, సున్నిపెంట, లింగాల గట్టు గ్రామాలను ప్రకాశం జిల్లాలో కలపాలని, మార్కాపురం జిల్లా పేరుకు బదులు శ్రీశైలం జిల్లా పేరును ఖరారు చేయాలని కోరారు. డిమాండ్లపై తీర్మానం చేసి, కాపీని రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు. నేతలు వట్టి వెంకటరెడ్డి, ధానీయేలు, కే.నాగిరెడ్డి, పులిరాజు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేతలు కే.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా పల్లకీ సేవ

బనగానపల్లె: మండలంలోని యాగంటిలో సోమవారం స్వామివార్ల పల్లకీ సేవ ఘనంగా జరిగింది. స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పాండురంగారెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహం.. పర్యావరణ హితం

- మట్టి విగ్రహాలపై ప్రజల్లో చైతన్యం
- ఉచితంగా అందజేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థలు



అమ్మడానికి సిద్ధంగా ఉంచిన మట్టి విగ్రహాలు



పట్టణ ప్రజలకు ఉచితంగా అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థల సభ్యులు, సీఐ

నంద్యాల(వ్యవసాయం): పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయన రంగుల విగ్రహాలను పక్కనబెట్టి, మట్టి విగ్రహాలను ఉపయోగించాలని కాలుష్య మండలి, పలు సేవా సంస్థలు చేస్తున్న కృషికి ప్రజల్లో చైతన్యం వస్తోంది. పలు సేవా సంస్థలు సోమవారం ఉచితంగా విగ్రహాలను పంపిణీ చేయడంతో భక్తులు వీటిని తీసుకొని ఇళ్లలో నెలకొల్పడానికి ఆసక్తి చూపారు. గతంలో తిమ్మాపురం, పెద్దకొట్టాల, తమ్మడపల్లె, రుద్రవరం, పోలూరు, టంగుటూరు గ్రామాల్లోని కుమ్మరులు విగ్రహాలను తయారు చేసి పండుగకు మూడు రోజుల ముందే పట్టణంలో విక్రయించేవారు. అయితే ఇటీవల మట్టి విగ్రహాలను ఉపయోగించాలనే భావన ప్రజల్లో అధికమైంది. దీంతో వీరు విక్రయిస్తున్న విగ్రహాలు పూర్తిగా అమ్ముడపోతున్నాయి. దీంతో గతంలో భక్తులు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను కొనుగోలు చేసేవారు.

మట్టి విగ్రహాల పంపిణీ..

గణేష్ మహోత్సవ కేంద్ర కమిటీ, విశ్వహిందూపరిషత్, బాలాజీ కాంప్లెక్స్‌లోని కొట్టి సుబ్బమ్మ, బాలాజీ కాంప్లెక్స్ కల్యాణ మండప సభ్యులు, వాసవీ క్లబ్ సభ్యులు, భవనాశి వెంకటసుబ్బయ్య చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పట్టణంలోని పలు స్టాళ్లను ఏర్పాటు చేసి సోమవారం దాదాపు 10వేల విగ్రహాలను ఉచితంగా విగ్రహాల పంపిణీ చేశారు. దీంతో పాటు మరికొన్ని సంస్థలు విగ్రహాలను పంపిణీ చేయడానికి ముందుకు వచ్చాయి. స్థానిక కల్పనా సెంటర్ వద్ద టాటా ఏఐఏ, భాష్యం స్కూల్ ఆధ్వర్యంలో ప్రజలకు మట్టి విగ్రహాలను మంత్రి ఫరూక్ పంపిణీ చేశారు. అలాగే.. ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్తా, స్థానిక దేవాలయాల వద్ద ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

విక్రయానికి విగ్రహాలు సిద్ధం..

వినాయక చవితి సందర్భంగా విగ్రహాలను విక్రయించడానికి కుమ్మరులు మట్టి విగ్రహాలను దిగుమతి చేశారు. గాంధీచౌక్, టెక్కె, నూనెపల్లె ప్రాంతాల్లో వీటిని విక్రయిస్తున్నారు. ఈ విగ్రహం పరిమాణం, ప్రత్యేకతను మట్టి రూ.100 నుంచి రూ.500 వరకు ధర నిర్ణయించారు.

మట్టి విగ్రహాలను అందజేయడం సంతోషకరం



పట్టణంలోని పలు స్వచ్ఛంద సంస్థలు మట్టి వినాయకులను ఇంటింటికీ పంచడం సంతోషకరం. లేకపోతే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను బయట కొనుగోలు చేసి పూజించేవాళ్లం. ప్రతి ఏడాది ఇలాంటి కార్యక్రమాలు చేయడంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చు.

–ఇందుమతి, గృహిణి, నంద్యాల

పర్యావరణాన్ని కాపాడేందుకే



15 సంవత్సరాల నుంచి పట్టణంలో ఇంటింటికీ వెళ్లి మట్టి విగ్రహాలను ఉచితంగా అందజేస్తున్నాం. భక్తులు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినాయక విగ్రహాలను కొనుగోలు చేయకుండా మట్టి విగ్రహాలను పూజించడానికి ఇష్టపడుతున్నారు. దాదాపు ఇప్పటి వరకు 6వేలకు పైగానే విగ్రహాలను పంపిణీ చేశాం. – కొట్టి చంద్రశేఖర్, బాలాజీ కల్యాణ మండప సభ్యుడు

కొన్నేళ్లుగా మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నాం



కొన్ని సంవత్సరాల నుంచి మట్టి విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తున్నాం. ప్రతి సంవత్సరం దాదాపు వెయ్యి విగ్రహాలకు పైనే తయారు చేస్తాం. విగ్రహం సైజును బట్టి రూ.50 నుంచి రూ.500 వరకు అమ్ముతున్నాం. మట్టి విగ్రహాలకు ప్రజల మంచి ఆదరణ లభిస్తుంది. గతంతో పోల్చుకుంటే రెండు, మూడేళ్ల నుంచి మా విగ్రహాల విక్రయాలు పెరిగాయి. – దీపు, గాంధీచౌక్

దివ్యాంగుల పింఛన్లను తొలగిస్తే ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నంద్యాల(అర్బన్): దివ్యాంగుల పింఛన్లను తొలగిస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య మాదిగ హెచ్చరించారు. దివ్యాంగుల, విద్యా, ఉద్యోగాల రిజర్వేషన్లను 4 నుండి 5 శాతానికి పెంచాలని డిమాండ్ చేశా. వికలాంగులై ఆదరణ లేని వారి జీవనోపాధులు తొలగించవద్దని కోరుతూ సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల స్థితిగతులను చూసి పాత పింఛన్లను తొలగించకుండా కొత్త పింఛన్లను 30శాతం పెంచి అందజేయాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గోస్పాడు: మండలంలోని దీబగుంట్ల గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న 14 మందిని సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. గ్రామం వద్దనున్న పొలాల్లో వివిధ గ్రామాలకు చెందిన పేకాటరాయిల్లు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేశారు. సుధాకర్, మునీర్, మొగల్ బేగ్, కృష్ణారెడ్డి తో పాటు మరో 11 మందిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.వారి నుంచి రూ.36,500 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

క్రమశిక్షణతో ఆనంద జీవితం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు క్రమశిక్షణ పాటిస్తే జీవితం ఆనందంగా సాగుతుందని, ప్రస్తుత కోర్సుల్లో ఎంబీఏ ముఖ్యమైనదని, విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఉద్యోగాలు పొందాలని పారిశ్రామికవేత్త, మాజీ ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆన్ మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్ అండ్ వీక్షిత్ భారత్–2047 ఏ రోడ్డు మ్యాప్ ఇన్ అసోసియేషన్ విత్ ఏపీ చాప్టర్ అనే అంశంపై రాష్ట్రస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మాజీ ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డి, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి, ఏఐఎంఎస్ చైర్మన్ ఆదిశేషారెడ్డి, నారాయణరెడ్డి, రాయలసీమ యూనివర్సిటీ ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు అనిల్‌రమేష్, సలీం, కమాల్, వినోద్, గోవర్ధన్, కళాశాల డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, ఎస్టేట్ మేనేజర్ ప్రగతిరెడ్డిలు పాల్గొన్నారు. ముఖ్యఅతిథులను కళాశాల యాజమాన్యం సన్మానించింది.

అడవి జంతువుల నుంచి పైర్లను కాపాడాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘంనాయకులు

నంద్యాల(న్యూటౌన్): అడవి జంతువుల నుంచి పైర్లను కాపాడాలని నల్లమల ఫారెస్ట్ వెంట రక్షణ వలయం నిర్మించాలని ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేసినట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, సహాయ కార్యదర్శి రామచంద్రుడు తెలిపారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని అటవీ సమీప ప్రాంతాలైన కొత్తపల్లి, ఆత్మకూరు, మహానంది, రుద్రవరం, చాగలమర్రి, కొలిమిగుండ్ల మండలాల్లో రైతాంగం సాగు చేసుకున్న మొక్కజొన్న, మినుము, వరి, వేరుశనగ లాంటి పంటలను అడవి పందులు నష్టం కలుగజేస్తున్నాయన్నారు. దిగుబడి సరిగా రాక గిట్టుబాటు ధర లేక ఇప్పటికే రైతాంగం ఇబ్బందులు పడుతోందన్నారు. జిల్లా ఉన్నతస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పంట నష్టం జరిగినప్పుడు గతంలో నిర్ణయించిన సొమ్ము కాకుండా ఎకరాకు రూ.30వేలు పరిహారం చెల్లించాలన్నారు.

వైద్య వృత్తిలో క్రమశిక్షణను కొనసాగించాలి



డాక్టర్ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోస్పాడు: వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని,ఈ వృత్తిలో క్రమశిక్షణను కొనసాగించాలని విజయవాడ ఎన్టీఆర్ హెల్త్ అండ్ సైన్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం శాంతిరాం వైద్య కళాశాలలో డాక్టర్ శాంతి రాముడు ఆధ్వర్యంలో వైద్య బోధన అధ్యాపకులు, పీజీ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి పీజీ, యూజీ పరిశోధన ప్రాజెక్టులకు నిధులు పెరుగుతాయన్నారు. తుది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు 80 శాతం హాజరు తప్పనిసరిగా ఉండాలన్నారు. అనంతరం వీసీని కళాశాల యాజమాన్యం, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రఘురాం, ఎండీ డాక్టర్ రవిబాబు, వైస్ చైర్మన్ డాక్టర్ మాధవీ లత, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వసంత చరణ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే శిక్షలు తప్పవు



మాట్లాడుతున్న జడ్జి శైలజ

శిరివెళ్ల: బాల్యవివాహాలు చేసినా, ప్రోత్సహించినా శిక్షార్హులవుతారని ఆళ్లగడ్డ సబ్ కోర్టు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి శైలజ హెచ్చరించారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు చట్టం ఒక్కటే సరిపోదని, ప్రజల్లో కూడా చైతన్యం రావాలన్నారు. బాలికలకు 18 ఏళ్లు, బాలురకు 21 ఏళ్లు వచ్చేంత వరకు వివాహ చేయరాదని ప్రతి పల్లెలో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. బాలికలకు వివాహాలు చేసిన వారికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు జరిమానా ఉంటుందనే విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. చదువుకొని జీవితంలో స్థిరపడిన తర్వాత వివాహాలు చేసేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. డీఎస్పీ ప్రమోద్ మాట్లాడుతూ బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే 1098కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీపీ శివప్రసాదు, ఏజీపీ బాల గురెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ తేజేస్విని, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసశర్మ, సీఐ దస్తగిరి బాబు, ఎస్ఐ చిన్న పీరయ్య పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఉచిత మినరల్ వాటర్



భూమి పూజ చేస్తున్న ఆర్ఎం రజియా సుల్తానా

నంద్యాల(వ్యవసాయం): ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది సౌకర్యార్థం ఎంపీ బైరెడ్డి శబరి నిధులతో స్థానిక బస్టాండ్ ఆవరణలో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాథ్‌రెడ్డి, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ రజియా సుల్తానా తెలిపారు. సోమవారం బస్టాండ్ ప్రాంగణంలో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణం కోసం భూమి పూజ భూమి చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్, కిశోర్, అజయ్, మనోజ్, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువులను రైతులకు అందించాలి



సహకార సంఘంలోని ఎరువులను పరిశీలిస్తున్న సీఐ

దొర్నిపాడు: ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా రైతులను అందించాలని ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని గుండుపాల ప్రాథమిక సహకార సంఘంలో నిల్వ ఉన్న ఎరువులను పరిశీలించారు. ఎవరులు స్టాక్ రిజిస్టర్లు, ఈ–పాస్ మిషన్‌లను తనిఖీ చేశారు. ఎరువులను అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రమీలకు సూచించారు. యూరియా స్టాక్‌పై సిబ్బందితో ఆరా తీయగా సహకార సంఘంలో యూరియా లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రామిరెడ్డి ఉన్నారు.

అహోబిలం దేవస్థాన సిబ్బంది నిరసన

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అహోబిలం దేవస్థాన సిబ్బంది నిరసనకు సిద్ధమయ్యారు. దేవస్థాన నిర్వాహకులు ఒంటెద్దు పోకడలను నిరసిస్తూ సిబ్బంది మొత్తం ఏకధాటిగా నిరసన వ్యక్తం చేయడంతో అవసరమైతే సమ్మె చేసేందుకు వెనుకాడమని ఏకగ్రీవ తీర్మానం చేశారు. సోమవారం దిగువ అహోబిలంలో సమావేశమైన సిబ్బంది మంగళవారం నోటీసు ఇచ్చిన అనంతరం నిర్వాహకులు స్పందించకపోతే సమ్మె చేసేందుకైనా వెనకడకూడదని తీర్మానం చేసుకున్నారు. దశాబ్దాలుగా పని చేస్తున్న సీనియర్‌లను సైతం లెక్క చేయకుండా నిన్నమొన్న ఎక్కడి నుంచో వచ్చిన కొందరు అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ దేవస్థాన ప్రతిష్టను మంట గలుపుతున్నారన్నారు. సిబ్బంది ఎవరిని వెంట తీసుకుపోకుండా తమకు అనుకూలమైన ఒకరిద్దరు ప్రైవేటు వ్యక్తులను తీసుకుపోయి నవనారసింహ క్షేత్రాల్లోని హుండీలు ఎత్తుకు వచ్చి లెక్కిస్తున్నారని, కొన్నిటిని రాత్రిళ్లు కూడా తీసుకు వచ్చి లెక్కించుకుంటున్నారని ఇది ఎంతవరకు సబబు అని మండి పడ్డారు. దూర ప్రాంతాలకు చెందిన రిటైర్డ్ అయిన వారిని తీసుకు వచ్చి ఉద్యోగాలు ఇచ్చి 20, 30 ఏళ్ల నుంచి పనులు చేస్తున్న తమపై పెత్తనం చేయించేదుకు సిద్ధమయ్యారని, దీన్ని పూర్తిగా కండిస్తున్నామని అన్నారు.

బాధ్యతలను స్వీకరించిన చైర్మన్లు

శిరివెళ్ల: మండలంలోని శిరివెళ్ల, బోయలకుంట్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల త్రి మెన్ కమిటీ సభ్యులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్లు కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, కాటంరెడ్డి అరుణ, సభ్యులచే ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ కోఆపరేటివ్ అధికారి ప్రకాశ్ ప్ర మాణ స్వీకారం చేయించారు.కార్యక్రమాల్లో కేడీసీసీ బ్రాంచి మేనేజర్ రేణుక, మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, సీఈఓలు దస్తగిరి, బాషా పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



దోమల నివారణ మందును పిచికారీ చేస్తున్న దృశ్యం

గోస్పాడు: వర్షాకాలంలో వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ అన్నారు. సోమవారం సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు ప్రబలుతాయని, వాటి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. దోమలను నివారించడానికి అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. అనంతరం దోమల నివారణ మందులను మెడికల్ విద్యార్థుల హాస్టల్‌లో పిచికారీ చేయించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ విజయ్ కుమారి, డాక్టర్ అరుణకుమారి, ఏవో డాక్టర్ రమ్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ నిరంజన్ పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ యూరియా గోడౌన్ తనిఖీ





యూరియా వివరాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్,మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(అర్బన్): జిల్లాలో నిల్వ ఉన్న యూరియా లభ్యతపై మార్క్ఫెడ్ గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం స్థానిక అయ్యలూరి మెట్టలోని మార్క్‌ఫెడ్ రేఖా గోడౌన్‌లో నిల్వ ఉంచిన యూరియా నిల్వలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి నిల్వలను పరిశీలించారు. అవసరమైన గ్రామాలకు యూరియా ఎటువంటి కొరత లేకుండా సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ఎరువుల దుకాణల్లో, ప్రాథమిక పరపతి సంఘాలు, రైతు సేవా కేంద్రాల్లో యూరియా అమ్మకాలను డీబీటీలో నమోదు చేయించాలని సూచించారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రాయించినా, కృత్రిమ కొరత సృష్టించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాకు త్వరలో దాదాపు 2,300 మెట్రిక్ టన్నుల యూరియా రానుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

జిల్లాలో సమృద్ధిగా యూరియా నిల్వలు

నంద్యాల: జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, వాటిని అవసరం మేరకు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో యూరియా నిల్వలు, కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో రైతుల అవసరం మేరకు 40,363 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉంచామన్నారు. యూరియా నిల్వల పర్యవేక్షణ కోసం జాయింట్ కలెక్టర్, ఆర్డీఓలు, తహసీల్దార్ల ఆధ్వర్యంలో టీం ఏర్పాటు చేశామని చెప్పారు. అధికారులు రైతు సేవా కేంద్రాలు, ఫెర్టిలైజర్స్ దుకాణాలు తనిఖీ చేసి రోజూ రిపోర్టు అందజేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం రూ.2,267 విలువ చేసే యూరియాను రైతుల శ్రేయస్సు కోసం సబ్సిడీ రూపంలో రూ.2వేలు తగ్గించి కేవలం రూ.267కు అందజేస్తోందని తెలిపారు. యూరియా విక్రయాలు ఈ–పాస్ పద్ధతిలో జరగాలన్నారు. ఆ వివరాలను ఐఎఫ్ఎంఎస్ సైట్‌లో నమోదు చేయడం ద్వారా జిల్లాకు అవసరం మేరకు నిల్వలు వస్తాయన్నారు. కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌కు సంబంధించి శాఖల వారీగా పెండింగ్ ఉన్న నివేదికలను సంబంధిత శాఖల ఈరోజు సాయంత్రంలోగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. స్వచ్ఛత అవార్డులకు సంబంధించి జిల్లా పరిధిలో ఉత్తమంగా నిర్వహిస్తున్న కార్యాలయాలను ఎంపిక చేసి 55 స్వచ్ఛ అవార్డులను ఇస్తామని, అలాగే రాష్ట్రంలో ఇచ్చే అవార్డులకు కూడా సిఫారసు చేస్తామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే గారూ..ఈ రోడ్డు వైపు చూడండి



బురదమయంగా అర్జునాపురం-నందింపల్లె రోడ్డు

దొర్నిపాడు: ఎమ్మెల్యే గారూ... అర్జునాపురం–నందిపల్లె రోడ్డు పైపు చూడాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. ఉన్నది కిలోమీటరు దూరమే అయినా చిన్న పాటి వర్షానికే దారి బురద కుంటను తలపిస్తోంది. దీంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పొలాలకు రైతులు వెళ్లాలన్నా సాధ్యం కాని పరిస్థితి. 2019 ఎన్నికలకు ముందు మంత్రిగా అఖిలప్రియా ఉన్నారు. ఆ సమయంలో దొర్నిపాడు నుంచి అమ్మిరెడ్డినగరం, అర్జునాపురం మీదుగా ఆళ్లగడ్డ మండలం నందింపల్లె వరకు ఉన్న తారు రోడ్డును తొలగించారు. అంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో పనులన్నీ నిలచి పోయాయి. అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దొర్నిపాడు నుంచి అర్జునాపురం వరకు రోడ్డు వేశారు. అక్కడి నుంచి నందిపల్లెకు రోడ్డు వేయాల్సి ఉంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అఖిలప్రియా ఎమ్మెల్యేగా ఎన్నికైంది. ఇప్పటికి ఏడాదికి పైగానే అయినా రోడ్డు పరిస్థితిని పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకోవాలని అర్జునాపురం, నందింపల్లె గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరుతున్నారు.